సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం । 27 । అక్టోబర్ । 2024



నిత్యాన్నదానానికి విరాళం


అన్నవరం: కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన బోను నాగమణి సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి, గోసంరక్షణ ట్రస్ట్‌కు శనివారం రూ.రెండు లక్షల విరాళం సమర్పించారు. ఆమెకు అన్నదానం, గోసంరక్షణ బాండ్లను సూపరింటెండెంట్ సత్య శ్రీనివాస్ అందచేశారు.



వృద్ధురాలి సజీవ దహనం

పెద్దాపురం రాజీవ్ కాలనీలో ఓ వృద్ధురాలు అగ్ని ప్రమాదంలో చిక్కుకుని సజీవ దహనం అయ్యింది. చుట్ట వెలిగించి వదిలేయడమే ప్రమాదానికి కారణమని అధికారులు తేల్చారు. 8లో

1.18 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం సాయంత్రం 1,18,355 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.70 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 9,500 క్యూసెక్కుల నీరు వదిలారు.

న్యూస్‌రీల్

31న ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షుడు సత్తిబాబు

అమలాపురం టౌన్: కార్మిక హక్కుల కోసం కృషి చేస్తున్న ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ నెల 31న నిర్వహిస్తామని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షుడు కె.సత్తిబాబు వెల్లడించారు. ఈ నెల 30, 31 తేదీల్లో అమలాపురంలోని జానకీ రామర్స్ కల్యాణ మండపంలో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక నడిపూడి రోడ్డులోని టాటా మ్యాజిక్ వాహనాల కార్యాలయంలో శనివారం ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా కన్వీనర్ వాసంశెట్టి సత్యం అధ్యక్షతన జరిగింది. దీనికి సత్తిబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలు ఉద్యోగ, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొని ఏఐటీయూసీ తీర్మానాలకు మద్దతు పలికారు. 30, 31 తేదీల్లో నిర్వహించే ఆవిర్భావ దినోత్సవ సభలు, వేడుకలు, కార్యక్రమాలపై పలు తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించారు. ఆంధ్రా ఆటోవాలా జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఊటాల వెంకటేష్, మెడికల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి సుబ్బారావు, ఏపీ రైతు సంఘ బాధ్యుడు మట్టపర్తి నారాయణ, క్లాప్ వెహికల్ డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ అరుణకుమార్, జట్టు లేబర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కురుచ నాగేశ్వరరావు ప్రసంగించారు.

నేడూ విద్యుత్ బిల్లుల వసూళ్లు

కొత్తపేట: జిల్లాలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో బిల్లుల వసూళ్ల కౌంటర్లు ఆదివారం సెలవు రోజైనా పని చేస్తాయని ఏపీఈపీడీసీఎల్ జిల్లా ఎస్ఈ ఎస్.రాజబాబు శనివారం సాయంత్రం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలతో పాటు ఏపీఈపీడీసీఎల్ సెక్షన్ ఆఫీస్ కౌంటర్లు, ఏటీపీ సెంటర్లలోనూ బిల్లులు చెల్లించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు రోహిత్



దున్నా రోహిత్‌ను అభినందిస్తున్న స్కూల్ హెచ్ఎం సుశీలామణి, పీడీ సునీల్‌కుమార్

కాజులూరు: జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు కాజులూరు మండలం గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న దున్నా రోహిత్ ఎంపికయ్యాడు. శనివారం ఆ స్కూల్‌లో హెచ్ఎం ఎస్ఎస్‌బీ సుశీలామణి ఆధ్వర్యంలో జరిగిన అభినందన సభలో పీడీ సునీల్‌కుమార్ మాట్లాడారు. సెప్టెంబర్‌లో అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎంపికల్లో రోహిత్ చక్కని ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 16 మంది ఈ జట్టుకు ఎంపిక కాగా, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి దున్నా రోహిత్ ఒక్కడే ఎంపిక కావటం గర్వకారణమన్నారు. నవంబర్ 6 నుంచి జమ్మూ కాశ్మీర్ రాజధాని శ్రీనగర్‌లో జరిగే సబ్ జూనియర్ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో రోహిత్ రాష్ట్ర జట్టు తరఫున పాల్గొంటాడన్నారు. గ్రామ సర్పంచ్ పోతురాజు ప్రసన్నమానిక, ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరి, ఎంపీటీసీ జొన్నకూటి పద్మజ, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కొలిశెట్టి సత్యం తదితరులు రోహిత్‌కు అభినందనలు తెలిపారు.

టైడల్ బ్యాంక్‌లు



ఉప్పలగుప్తం మండలం ఎస్.యానం సమీపంలో దెబ్బతింటున్న టైడల్ బ్యాంకు



కాట్రేనికోన మండలం చిర్రయానం వద్ద టైడల్ బ్యాంకు దుస్థితి

- సముద్ర తీరంలో రక్షణ కవచానికి తూట్లు
- గోదావరి ఏటిగట్లను ఆనుకుని తీరంలో టైడల్ బ్యాంక్ నిర్మాణం
- నిఘా లేక పలుచోట్ల ధ్వంసం

సాక్షి, అమలాపురం: సముద్ర తీర ప్రాంతానికి రక్షణ కవచంలా ఉన్న టైడల్ బ్యాంక్ (శివారు ఏటి గట్టు) పలుచోట్ల ధ్వంసమవుతోంది. మరికొన్ని చోట్ల నామరూపాలు లేకుండా పోతుంది. ఆక్వా చెరువులు, తీరంలో ఇసుక తవ్వకాలతో వచ్చిన తంటా ఇది. దీనివల్ల ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీరానికి రక్షణ లేకుండా పోయింది.

జిల్లాలో బ్రిటీష్ కాలంలో తీర ప్రాంత రక్షణ కోసం టైడల్ బ్యాంకుల నిర్మాణాలు జరిగాయి. వృద్ధ గౌతమీ నదీపాయ నుంచి వైనతేయ నదీపాయ వరకూ, తిరిగి అక్కడి నుంచి వశిష్ట నదీ పాయ వరకూ టైడల్ బ్యాంకులు నిర్మించారు. గోదావరి నదీపాయల వెంబడి రక్షణగా ఉన్న ఏటిగట్లకు అనుసంధానంగా వీటి నిర్మాణాలు జరిగాయి. తర్వాత పటిష్టం చేసే పనులను గాలికి వదిలేశారు. 2008లో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రూ.650 కోట్లతో చేపట్టిన గోదావరి ఏటిగట్ల పటిష్ట పనుల్లో టైడల్ బ్యాంకుల పటిష్టతకు నిధులు మంజూరు చేశారు. ఇందులో భాగంగా వృద్ధ గౌతమీ నదీ పాయ మీద ఉన్న గౌతమీ రైట్ బ్యాంకు (జీఆర్‌బీ) ముగిసే కాట్రేనికోన మండలం బలుసుతిప్ప నుంచి చిర్రయానాం పల్లభూమి వరకూ నిర్మాణ పనులు మొదలు పెట్టారు. ఆయన మృతి చెందిన తరువాత మిగిలిన టైడల్ బ్యాంకు నిర్మాణాలు గాలిలో కలిసిపోయాయి. అప్పట్లో వీటిని పటిష్టం చేసి రహదారులు నిర్మించడం ద్వారా సముద్ర కోత నుంచి రక్షణ... తీర ప్రాంత మత్స్యకార గ్రామాలను అనుసంధానం చేస్తూ రహదారి నిర్మించాలనే ప్రతిపాదనలు కూడా జరిగాయి. తరువాత కాలంలో ఇవి కాగితాలకే పరిమితం అవుతున్నాయి.

సఖినేటిపల్లి మండలం అంతర్వేది సముద్ర సంగమ ప్రాంతం నుంచి కాట్రేనికోన మండలం నీళ్లరేవు వరకూ తీరం విస్తరించి ఉంది. ఇది సుమారు 108 కిలోమీటర్ల వరకూ ఉంటోంది. ఇందులో బలుసుతిప్ప నుంచి చిర్రయానాం వరకూ ఉన్న టైడల్ బ్యాంకు కొంత వరకూ పటిష్టం చేసి వదిలేశారు. ఈ బ్యాంకుపై కాపులపాలెం నుంచి గచ్చకాయల పొర వరకూ బీటీ రోడ్డు వేశారు. ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం పల్లభూమి నుంచి వాసాలతిప్ప, అల్లవరం మండలం నక్కా రామేశ్వరం మీదుగా ఓడలరేవు వైనతేయ నదీ పాయ వరకూ పలుచోట్ల రోడ్డు ఉంది. సుమారు 22 కిలోమీటర్ల మేర ఉన్న టైడల్ బ్యాంకు పరిధిలో బీటీ రోడ్డు లేని పలుచోట్ల ధ్వంసమవుతుంది. ఎస్.యానాం, చల్లపల్లి, వాసాలతిప్ప, నక్కా రామేశ్వరం ఓడరేవుల వద్ద ఉన్న గట్లను ధ్వంసం చేశారు. కొన్నిచోట్ల ఆక్వా చెరువుల్లో కలసిపోగా, మరికొన్ని చోట్ల అక్రమ ఇసుక తవ్వకాలలో కబ్జా బారిన పడ్డాయి. కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) పరిధిలో కూడా ఆక్వా చెరువులు, ఇసుక తవ్వకాలు జరుగుతున్న విషయం తెలిసిందే. 2014–19 కాలంలో ఓడలరేవు టెర్మినల్ నిర్మాణం కోసం భూమి చదును చేసేందుకు టీడీపీ నేతలు వందలాది ఎకరాల్లో ఇసుక తవ్వకాలు చేశారు. దీనివల్ల తీరంలో టైడల్ బ్యాంకు కనుమరుగైంది. ఇక రాజోలు దీవిలో టైడల్ బ్యాంకు ఆనవాళ్లు లేకుండా పోయాయి. ఇక్కడ బ్యాంకుల ఉన్నాయనే విషయాన్నే స్థానికులు మరిచిపోయారు.

విపత్తుల సమయంలో రక్షణేదీ?

జిల్లాలో సముద్ర కోత గణనీయంగా పెరిగిన విషయం తెలిసిందే. అంతర్వేది నుంచి నీళ్లరేవు వరకూ సముద్రం చొచ్చుకు వస్తోంది. సహజ సిద్ధమైన ఇసుక దిబ్బలు సముద్రంలో కలిసిపోతున్నాయి. ఓడలరేవు ఓఎన్జీసీ ఆఫ్‌షోర్ టెర్మినల్ వరకూ సముద్రం చొచ్చుకు వచ్చిన విషయం తెలిసిందే. సముద్ర మట్టాలు పెరగడంతో ఇదే కోత మరింత ముందుకు వస్తే విలువైన భూములు సముద్ర గర్భంలో కలసిపోనున్నాయి. ఈ కోత పెరగకుండా కాపాడేది టైడల్ బ్యాంకులేననే విషయాన్ని ప్రకృతి నిపుణులు గుర్తుచేస్తున్నా పట్టించుకునేవారు లేకుండా పోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సునామీ వంటి విపత్తుల సమయంలో సముద్ర కెరటాలను నిలువరించే టైడల్ బ్యాంకులను పటిష్టం చేయడంతోపాటు వాటికి రక్షణ కల్పించాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

ఇరిగేషన్‌లో గందరగోళం

టైడల్ బ్యాంకులు ఎవరి పరిధిలోకి వస్తాయనే దానిపై ఇరిగేషన్ శాఖలోనే స్పష్టత లేకపోవడం గమనార్హం. ఇప్పుడున్న గౌతమీ నుంచి వైనతేయ వరకూ సుమారు 45 కిమీల టైడల్ బ్యాంకు ఉండగా, దీనిలో 35 కిలోమీటర్లు ఇరిగేషన్ శాఖ పరిధి, మరో 10 కిలోమీటర్లు డ్రెయిన్స్ పరిధిలో ఉంది. కూనవరం నుంచి వాసాలతిప్ప వరకూ డ్రెయిన్స్ పరిధిలో ఉన్న టైడల్ బ్యాంకు మొత్తం ధ్వంసం అయ్యింది. మురుగునీటి కాలువల్లో పూడిక తీసేందుకు సైతం నిధులు లేక అల్లాడుతున్న ఈ శాఖ అధికారులు టైడల్ బ్యాంకు రక్షణ చర్యలు చేపడతారనే నమ్మకం తీర ప్రాంత వాసులకు, రైతులకు లేకుండా పోయింది.

ప్రతిపాదనలు బుట్టదాఖలు

గతంలో తీరంలో ఉన్న టైడల్ బ్యాంకు పటిష్ట పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కాకినాడ డీప్ వాటర్ పోర్టు వద్ద నమోదైన సముద్ర గరిష్ట ఉపరితలానికి 2.1 మీటర్ల ఎత్తు, దీనికి అదనంగా మరో 1.5 మీటర్ల ఎత్తు పెంచి మొత్తం 3.60 మీటర్ల ఎత్తున టైడల్ బ్యాంకు నిర్మించాలని అధికారులు అంచనాలు రూపొందించారు. ఇందుకు రూ.30 కోట్లు అవుతోందని రూపొందించిన ప్రాథమిక అంచనాలు బుట్టదాఖలయ్యాయి.

పూర్తి అధ్వానంగా..



తీరం వెంబడి ఉన్న టైడల్ బ్యాంకు పూర్తి అధ్వానంగా మారింది. ఇప్పటికే సముద్రం కోతకు గురవుతూ కొన్ని సందర్భాల్లో పల్లపు ప్రాంతాల వైపు మళ్లుతుంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు టైడల్ బ్యాంకు రక్షణ లేకపోవడంతో నీరు గ్రామాల్లోకి చొరబడే అవకాశం ఉంది. వెంటనే టైడల్ బ్యాంకును పటిష్టం చేయాలి.

–చీకట్ల శ్రీను, ఎస్.యానం, ఉప్పలగుప్తం మండలం

ఆక్రమణల నుంచి రక్షించాలి



డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటైన నాటి నుంచి నేటి వరకూ టైడల్ ప్రాంతంలో వ్యర్థాలను తొలగించిన దాఖలాలు లేవు. ముంపు నీరు నిల్వ ఉండే టైడల్ ప్రాంతం చెత్తతో నిండిపోయింది. ఈ ప్రాంతాన్ని ఆక్రమణల నుంచి పరిరక్షించాలి. అలాగే టైడల్ ప్రాంతంలో గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేసి చెట్లను పెంచితే కోతను నివారించవచ్చు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

–సోమాని వెంకటరమణ, ఓడలరేవు, అల్లవరం మండలం

పరీక్ష ఫీజు చెల్లింపునకు షెడ్యూల్ విడుదల



ఎన్.సురేష్

రాయవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపునకు షెడ్యూల్ విడుదలైంది. ఈ విషయాన్ని ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్. సురేష్ తెలిపారు. ఈ నెల 28 నుంచి ఆన్‌లైన్‌లో పరీక్షల ఫీజును చెల్లించేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఈ నెల 28 నుంచి నవంబరు 11వ తేదీ వరకూ ఎటువంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజును చెల్లించవచ్చన్నారు. రూ.50 ఫైన్‌తో నవంబరు 12 నుంచి 18 వరకూ, రూ.200 అపరాధ రుసుంతో నవంబరు 19 నుంచి 25 వరకూ, రూ.500 అపరాధ రుసుంతో నవంబరు 26 నుంచి నవంబరు 30 వరకూ ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. పరీక్ష ఫీజును ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజు చెల్లించే సమయంలో ప్రధానోపాధ్యాయులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

వేంకటేశుని ఆలయానికి విరాళం



ఆలయానికి రూ.1.08 లక్షలను అందజేస్తున్న దాత చంద్రశేఖర్

అంబాజీపేట: ఇసుకపూడి జక్కంశెట్టివారిపాలెంలో భూ సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి పుల్లేటికుర్రుకు చెందిన దంగేటి సూర్యనారాయణ కుమారుడు చంద్రశేఖర్, ఉమలత దంపతులు రూ.1.08 లక్షలు శనివారం విరాళంగా సమర్పించారు. ఈ మొత్తంతో వచ్చిన వడ్డీని స్వామివారి శ్రవణా నక్షత్రం, కైంకర్యాలకు ఉపయోగించాలని ఆలయ కమిటీకి దాత దంపతులు వివరించారు. అలాగే ఇళ్ల దుర్గాప్రసాద్ కుమారుడు వెంకట ఆదిత్య రూ.5,400 అందించారని కమిటీ సభ్యులు తెలిపారు. అంతకుముందు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. విరాళాలు అందించిన దాతలను సత్కరించి, స్వామివారి ప్రసాదాలను అందించారు.

ఓపెన్ హౌస్‌తో పోలీసు వ్యవస్థపై అవగాహన



అమలాపురంలో పోలీసు ఆయుధాల ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

అమలాపురం టౌన్: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఓపెన్ హౌస్' ద్వారా విద్యార్థులకు పోలీసు వ్యవస్థపై అవగాహన ఏర్పడుతుందని జిల్లా ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్ అన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో పోలీసుల విధులు, ప్రజారక్షణలో వారి పాత్ర పట్ల విద్యార్థుల్లో అవగాహన పెరుగుతుందన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా స్థానిక జిల్లా ఆర్మ్‌డ్ కేంద్రం ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన పోలీసు ఆయుధాల ప్రదర్శనను ఏఎస్పీ ప్రసాద్ ప్రారంభించారు. పోలీసులు విధి నిర్వహణలో ఉపయోగించే తుపాకులు, డ్రోన్లు, కెమెరాలు, ఫింగర్ ప్రింట్‌లు సేకరించే పరికరాలు, నేర పరిశోధనకు వాడే పలు ఆయుధాలు, పరికరాలు, యంత్రాలను ఈ ప్రదర్శనలో ఉంచారు. పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని ఆయుధాలను తిలకించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు, ఆర్మ్‌డ్ విభాగం ఆర్ఐ సూర్యనారాయణ, స్పెషల్ బ్రాంచి సీఐ బి.రాజశేఖర్, పట్టణ ఎస్సై కిషోర్‌బాబు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు మోరి విద్యార్థినులు



మోరిలో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైన విద్యార్థినులతో బోధనా సిబ్బంది

సఖినేటిపల్లి: మోరి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం ఎస్.శ్రీధర్‌కృష్ణ శనివారం తెలిపారు. ఈ నెల 24, 25 తేదీల్లో రాజమహేంద్రవరంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి అండర్- 14, 17 బాల బాలికల అథ్లెటిక్స్ పోటీలు జరిగాయన్నారు. అండర్- 17 బాలికల విభాగంలో మూడు వేల మీటర్ల స్పీడ్ వాక్‌లో ముత్యాల గీత జిల్లా ప్రథమ, హైజంప్‌లో చెల్లుబోయిన దేవీసత్యశ్రీ ద్వితీయ స్థానం సాధించారన్నారు. అండర్- 14 బాలికల హైజంప్‌లో చెల్లుబోయిన భావన ద్వితీయ, చెల్లుబోయిన భువన తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. అండర్- 14 బాలికల విభాగం 80 మీటర్ల హార్డిల్స్‌లో చెల్లుబోయిన భువన జిల్లా ద్వితీయ స్థానం సాధించిందన్నారు. ఎంపికైన విద్యార్థినులకు వచ్చే నెల 3, 4 తేదీల్లో శ్రీకాకుళంలో రాష్ట్ర అండర్-17 పోటీలు, 6, 7 తేదీలలో ఏలూరులో అండర్- 14 పోటీలు జరుగుతాయన్నారు. క్రీడాకారులు, వీరికి తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు కట్టా కృష్ణప్రసాద్, దివ్యలను మోరి, మోరిపోడు సర్పంచ్‌లు పి లక్ష్మీపద్మ మంగతాయారు, ఎం.అలివేలు గంగా త్రివేణి, అభివృద్ధి కమిటీ చైర్మన్ జాన శంకరరావు, ఎంఈఓలు డి.కిశోర్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, విద్యా కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీలక్ష్మి అభినందించారు.

మనోహరం... శ్రీనివాసుని బ్రహ్మోత్సవం



స్వామివారికి శ్రీపుష్పయాగం నిర్వహిస్తున్న పండితులు, భక్తులు



శ్రీకృష్ణ అలంకరణతో స్వామికి సూర్యప్రభ వాహన సేవ

ఆత్రేయపురం: వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కోనేటి రాయుడి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శనివారం కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారికి పట్టువస్త్రాలను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, దేవదాయ ధర్మదాయశాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ నల్లం సూర్య చక్రధరరావు దంపతులు సమర్పించారు. అనంతరం శ్రీపుష్పయాగంలో వారు పాల్గొని పూజలు చేశారు. సూర్య, చంద్ర వాహనాలపై స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం జరిపారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారికి సప్తకలశారాధన, ప్రధాన హోమాలు, నీరాజన మంత్రపుష్పాలు, స్వస్తి వచనం, సాయంత్రం నవగ్రహ హోమాలు, సహస్ర దీపాలంకరణ సేవలను వైఖానస యువబ్రహ్మ ఆగమ భాస్కర శ్రీఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు నిర్వహించారు. ఎస్సై రాము ఆధ్వర్యంలోబందోబస్తు ఏర్పాటు చేశారు.

నేటి కార్యక్రమాలు

ఉదయం విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, వివిధ పూజా కార్యక్రమాలు, రాజాధిరాజ అలంకరణతో గజ వాహన సేవ ఉంటాయి. ఈ పూజలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ సూర్యచక్రధరరావు వివరించారు.

కుటుంబ తగాదాలపై టీడీపీకి అంత ఆసక్తి ఎందుకో?


మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

చాగల్లు: తనకు చెందని ఆస్తి కోసం చంద్రబాబు అండ్‌కోతో షర్మిళ చేతులు కలిపిందని, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జైలుకు పంపేందుకు ప్రయత్నిస్తుందని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. షర్మిళ అత్యాశతో అహంకార పూరితంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. కుటుంబ తగాదాలపై టీడీపీకి అంత ఆసక్తి ఎందుకని ప్రశ్నించారు. చాగల్లులో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన సోదరి షర్మిళమ్మ రాసిన లేఖను జై టీడీపీ అఫీషియల్ ఎక్స్ హ్యాండిల్లో బిగ్ బ్లాస్ట్ అంటూ పోస్ట్ చేసి, నాణేనికి ఒకవైపే చూపించి ప్రజలను పక్కదోవ పట్టించడం వెనుక అసలు ఉద్దేశం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేని చంద్రబాబు, ప్రజల దృష్టిని మళ్లించడానికి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆయన విమర్శించారు. చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్టును షర్మిళ చదువుతున్నారన్నారు. సరస్వతి పవర్ షేర్ల అంశం హైకోర్టులో ఉందని, ఆ కేసులు పరిష్కారమయ్యే వరకూ షేర్ల బదలాయింపు జరగదన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరస్వతి పవర్ ప్రాజెక్టు కోసం రైతుల నుంచి చట్ట ప్రకారం భూములు కొన్నారని, దీనిని ఎల్లో మీడియా వక్రీకరించడం సమంజసం కాదని అన్నారు. ఆనాడు సోనియాగాంధీతో కుమ్మక్కైన చంద్రబాబు వైఎస్ జగన్‌పై తప్పుడు కేసులు బనాయించారని, ఫలితంగా జగన్ ఆస్తులు సీబీఐ, ఈడీ అటాచ్‌లో ఉన్నాయన్నారు. అసలు చంద్రబాబు ఏనాడైనా తన ఆస్తులను తమ్ముళ్లు, చెల్లెమ్మలకు రాసిచ్చారా అని నిలదీశారు. చంద్రబాబు తన ఉనికి కోసం సొంత తమ్ముడు రామ్మూర్తినాయుడిని ఎదగకుండా చేశాడని విమర్శించారు.

పట్టుకున్నారు.. వదిలేశారు!

- చేతులు మారిన భారీ తాయిలాలు
- ఇసుక దందాలో ఎన్నో లీలలు

ఆత్రేయపురం: అవును.. ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక గ్రామంలో ఇసుక లారీని రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టుకున్నారు. ఆత్రేయపురం బస్టాండ్‌కు తీసుకువచ్చారు. తర్వాత వదిలేశారని సమాచారం. లారీని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసేందుకు ఆత్రేయపురం తరలించారు. కాగా రాత్రికి రాత్రి పెద్ద మొత్తంలో అధికారులకు సదరు లారీ యాజమాన్యం ముట్టజెప్పడంతో లారీని వదిలేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లకు మాత్రమే రేవులోంచి ఇసుకను తీసుకు వెళ్లడానికి ప్రభుత్వం అనుమతినిచ్చింది. దీనిని తొలుత సీరియస్‌గా తీసుకున్న అధికారులు జేబులు తడవగానే మెత్తబడి లారీని


అధికారులు స్వాధీనం చేసుకున్న లారీ

పట్టుకోలేదు. అసలు లారీ ఏంటి అంటూ చెప్పుకొచ్చారు. మరి రాత్రి బొబ్బర్లంక నుంచి తీసుకువచ్చి ఆత్రేయపురం సెంటర్‌లో ఉన్న లారీ పొద్దున్నకు మాయం కావడానికి కారణాలు రెవెన్యూ, ఇరిగేషన్, హెడ్‌వర్క్స్ అధికారులకే తెలియాలి. ఆత్రేయపురం మండలంలో గౌతమీ, వశిష్ట గోదావరిలో ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. గౌతమీ వశిష్ట గోదావరిలో బొబ్బర్లంక, పేరవరం, రాజవరం, పులిదిండి, కట్టుంగ తదితర గ్రామాల్లో రాత్రి వేళల్లో ఇసుకాసురులు భారీ వాహనాలతో ఇసుకను తరలించుకు పోతున్నారు. వాటిని నియంత్రించాల్సిన రెవెన్యూ ఇరిగేషన్, హెడ్‌వర్క్స్, పోలీస్ అధికారులు ఉత్తుత్తి దాడులు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నారు. కాగా శుక్రవారం రాత్రి బొబ్బర్లంక గ్రామంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక లారీని అధికారులు పట్టుకున్నారు. దానిని బొబ్బర్లంక నుంచి మండల కేంద్రం ఆత్రేయపురం గ్రామానికి తరలించారు. అనంతరం ఇసుకాసురులతో అధికారులు కుమ్మక్కై వాహనాన్ని వదిలేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై తహసీల్దార్ టి.రాజేశ్వరరావును వివరణ కోరగా వాహనాన్ని స్వాధీనం చేసుకున్న విషయం తమ దృష్టికి రాలేదన్నారు.

వైభవంగా పవిత్రోత్సవాలు ప్రారంభం


బాలాజీ స్వామికి పూజలు నిర్వహిస్తున్న పండితులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి సన్నిధిలో మూడు రోజుల పాటు జరిగే పవిత్రోత్సవాలను శనివారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఈ ఉత్సవాలను త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామివారి శిష్య బృందం ఆధ్వర్యంలో చేపట్టారు. పుట్ట మట్టితో ఈ కార్యక్రమాన్ని కన్నుల పండువగా జరిపించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.సత్యనారాయణరాజు పర్యవేక్షణలో పూజలు జరుగుతున్నాయి. నవకలశ, పంచామృత సుగంధ ద్రవ్యాలతో ఉత్సవమూర్తులకు అభిషేకం చేశారు. ఉత్సవ మూర్తులు, పవిత్రాలు, పూజా ద్రవ్యాలను ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకువచ్చి పవిత్రోత్సవాలను జరిపించారు.

వ్యవసాయ అధికారులుగా పదోన్నతి

రాజమహేంద్రవరం రూరల్: ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు వ్యవసాయ విస్తరణ అధికారులకు మండల వ్యవసాయ అధికారులుగా పదోన్నతులు ఇస్తూ వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు ఉత్తర్వులు జారీ చేశారని వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేణుమాధవరావు తెలిపారు. సీతానగరం మండలంలో పనిచేస్తున్న పీవీ శ్రీనివాస్‌కు పెద్దాపురం సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో వ్యవసాయాధికారిగా, ఆలమూరు మండలంలో పనిచేస్తున్న కిశోర్‌బాబుకు తాడేపల్లిగూడెం పురుగు మందుల ప్రయోగశాలకు, కపిలేశ్వరపురం మండలంలో పనిచేస్తున్న ఐ.లక్ష్మిని కాకినాడ సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో వ్యవసాయాధికారిగా నియమించారు. శనివారం వీరు బాధ్యతలు స్వీకరించారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

కిర్లంపూడి: అప్పుల బాధ తాళలేక పురుగు మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ ఎస్.వెంకటరమణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలో కృష్ణవరం గ్రామానికి చెందిన అరిపి సత్తిబాబు (31) రెండేళ్ల కిందట కుటుంబ అవసరాల నిమిత్తం రూ. 2 లక్షలు అప్పు చేశాడు. మృతుడికి ఎడమ కాలు అంగ వైకల్యంతో బాధపడుతున్నాడు. ఆటో నడుపుకొంటూ తన భార్య, ఎనిమిదేళ్ల కుమార్తెను పోషించుకుంటున్నాడు. అప్పులు తీర్చలేకపోతున్నాననే మానసిక వేదనతో ఈ నెల 21న మధ్యాహ్నం గ్రామ శివారు కొబ్బరి తోటలోకి వెళ్లి గడ్డి మందు తాగాడు. అనంతరం తన స్నేహితుడు కాసిన బాబీకి ఫోన్ చేసి జరిగిన విషయం తెలిపాడు. దీంతో మృతుడు అన్నయ్య ఆంజనేయుడు, బాబీ అక్కడకు చేరుకుని ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య భవాని ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తి దుర్మరణం


ప్రమాదంలో ధ్వంసమైన కారు

రాజానగరం: జాతీయ రహదారిపై తూర్పుగానుగూడెం వద్ద వ్యాన్, కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం నుంచి మురారి వైపు వెళ్తున్న ఐసర్ వ్యాన్ తూర్పుగానుగూడెం శివారులో జంక్షన్ వద్ద తిరిగి రాజమహేంద్రవరం వెళ్లేందుకు యూ టర్న్ తీసుకుంటుండగా, అదే సమయంలో మురారి వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. కారు ముందు భాగం తునాతునకలై డ్రైవింగ్ చేస్తున్న తొండంగి మండలం, వలసపాకల అగ్రహారానికి చెందిన నట్టే వెంకటరమణ (32) అక్కడికక్కడే మృతి చెందాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన అతను రాజమహేంద్రవరంలో జరిగే ఒక శుభకార్యానికి వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసును ఎస్సై మనోహర్ దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి లాన్ టెన్నిస్ పోటీలకు సన్నద్ధం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడలో రాష్ట్ర స్థాయి లాన్ టెన్నిస్ అండర్-14, 17, 19 విభాగ పోటీలను జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. రాష్ట్ర లాన్ టెన్నిస్ అసోసియేషన్ సహకారంతో ఈ పోటీల నిర్వహణకు స్థానిక డీఎస్ఏ క్రీడా మైదానంలోని టెన్నిస్ కోర్టులను నిర్వాహకులు సిద్ధం చేశారు. ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి 350 మంది క్రీడాకారులు, 100 క్రీడాధికారులు, కోచ్ మేనేజర్లు, నిర్వహణా కమిటీ సభ్యులు, సాంకేతిక సిబ్బంది హాజరు కానున్నారు. బాలికలకు డీఎస్ఏ తైక్వాండో హాలులో, బాలురకు డీఎస్ఏ ఇండోర్ హాల్ మేడపై, మదర్‌థెరిసా మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్ గుడారిగుంటలో వసతి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జార్జి మాట్లాడుతూ జాతీయ స్థాయి ప్రమాణాలతో ఏర్పాట్లు చేశామన్నారు. వివిధ జిల్లాల నుంచి హాజరవుతున్న క్రీడాకారులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈ ఏర్పాట్లను ఎస్‌జీఎఫ్ఐ జిల్లా సంయుక్త కార్యదర్శులు సునీల్, పరశురాం, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు జార్జి శనివారం పర్యవేక్షించారు. రాష్ట్ర లాన్‌టెన్నిస్ సంఘ కార్యదర్శి రామ్‌కుమార్ సాంకేతిక సహకారం అందిస్తున్నారు.

పెట్రోల్, డీజిల్ అక్రమ అమ్మకాలు అరికట్టాలి


సమావేశంలో పాల్గొన్న కోనసీమ పెట్రోల్ బంక్ యజమానులు

అమలాపురం రూరల్: యానాం నుంచి తీసుకువస్తున్న పెట్రోల్, డీజిల్ అక్రమ అమ్మకాలను అరికట్టాలని కోనసీమ పెట్రోల్ బంక్ యజమానుల సంఘ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శనివారం అమలాపురంలోని లయన్స్ క్లబ్‌లో జిల్లా పెట్రోల్ బంక్ డీలర్ల సంఘ సమావేశం జరిగింది. పెట్రోల్ అక్రమ అమ్మకాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. యానాంలో గతంలో జనాభా ప్రాతిపదికన రేషన్ పద్ధతిలో ఐఓసీ, హెచ్‌పీసీ, బీపీసీ పెట్రోల్ బంక్‌ల్లో డీజిల్ అమ్మకాలు జరిగేవని, ఇప్పుడు ఆ విధానాన్ని అమలు చేయాలని వారు కోరారు. అదేవిధంగా కొన్ని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో అక్రమంగా పెట్రోలు, డీజిల్ తరలిస్తున్నారని, వాటిని అరికట్టాలని సమావేశం కోరింది. యానాం నుంచి అక్రమ ఆయిల్ రవాణా అరికట్టాలని, దాని వెనుక ఉన్న ముఠా సభ్యులను అరెస్ట్ చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న పెట్రోల్ బంక్ డీలర్లకు యానాం నుంచి వస్తున్న ఆయిల్ కారణంగా నష్టాలు వస్తున్నాయన్నారు. సంఘ ప్రతినిధులు జవ్వాది తాతబాబు, సుబ్బరాజు, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు అస్వస్థత


ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపీ కోసం క్యూ కట్టిన విద్యార్థులు

నల్లజర్ల: దూబచర్ల గాంధీకాలనీలోని న్యూ లైఫ్ హైస్కూల్‌లో 15 మంది హాస్టల్ విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. శనివారం వీరిని ప్రత్యేక వాహనంలో వార్డెన్ రవిరాజు నల్లజర్ల ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకువచ్చారు. వారికి ఒళ్లంతా ఎలర్జీలు, కళ్ల కలకతో ఉన్నారు. ఆహారం లేక నీరు కలుషితం అయ్యిందా అనే విషయాలు తెలియాల్సి ఉంది. ఇక్కడ పదో తరగతి వరకూ చదువుతూ హాస్టల్‌లో ఉండే బాలబాలికలు మొత్తం 190 మంది వరకూ ఉన్నారు. తమకు తరచూ ఇదే విధంగా చర్మ సంబంధిత వ్యాధులు వస్తున్నాయని విద్యార్థులు పూర్ణచందు, రిషి, అఖిల్, పృథ్వీ, విశ్వతేజ తదితరులు వివరించారు. డాక్టర్ గంగాధరరావు వారందరికీ చికిత్స చేసి మందులు ఇచ్చి పంపారు. ఆ హాస్టల్ విద్యార్థులకు తరచూ ఇదే విధమైన రుగ్మతలు వస్తున్నాయని ఆయన చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి తహసీల్దార్ శాంతిప్రియ హాస్టల్‌ను పరిశీలించారు. తాగునీరు, టాయిలెట్లు, వంట గది, ఆహార పదార్థాలను చూశారు. దీనిపై కరస్పాండెంట్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ దసరా సెలవులకు వెళ్లిన విద్యార్థులు ఇటీవలే హాస్టల్‌కు తిరిగి వచ్చారని, జనరల్ చెకప్‌లో భాగంగానే విద్యార్థులను ఆసుపత్రికి పంపామన్నారు. ఎటువంటి రుగ్మతలు లేవని వివరణ ఇచ్చారు.

వృద్ధురాలి సజీవ దహనం


బూరమ్మ మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెద్దాపురం: స్థానిక రాజీవ్ కాలనీలో ఓ వృద్ధురాలు పూరి గుడిసెలో చిక్కుకుని సజీవ దహనం అయ్యింది. పెద్దాపురం అగ్నిమాపకాధికారి జగన్నాథం, ఎస్ఐ మౌనిక కథనం ప్రకారం.. స్థానిక శివారు రాజీవ్ కాలనీలో పూరి గుడిసెలో కనకాల బూరమ్మ (75) ఉంటోంది. శనివారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగి ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె చుట్టను వెలిగించి నిర్లక్ష్యంగా ఉండడం కారణంగానే పూరి గుడిసెకు నిప్పంటుకోవడంతో పాటు ఆమె గుడిసెలో ఇరుక్కుపోయింది. ఆమె మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అభివృద్ధి ప్రణాళికలపై అవగాహన అవసరం

సామర్లకోట: అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయడంపై అవగాహన ఉండాలని విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అన్నారు. అనకాపల్లి, విశాఖపట్నం, ఏలూరు, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన డీపీఓలు, ఎల్‌డీఓలు, ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక సిబ్బందికి స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రంలో రెండు రోజుల శిక్షణ జరిగింది. శనివారం ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ జిల్లా పరిషత్తు, మండల పరిషత్తు, గ్రామ పంచాయతీల అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలు తయారు చేయడం ఎంతో కీలకమన్నారు. దీనిని గుర్తించిన రాష్ట్ర పంచాయతీ రాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి సంస్థ ఈటీసీల పరిధిలోని అధికారులకు ఎంటీటీలుగా శిక్షణ ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసే విధానంపై ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సోమవారం నుంచి శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన అధికారులకు శిక్షణ ఉంటుందని చెప్పారు. శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్, ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, అంజనేయులు, పి.ప్రసాద్, కేఆర్ నిహారిక, మోహీద్దీన్, పంచాయతీరాజ్ శాఖ జాయింట్ డైరెక్టర్ జి.రమణ పాల్గొన్నారు.